కరాటేలో అదరహో..

- అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో సత్తా చాటిన క్రీడాకారులు
- పలు విభాగాల్లో పతకాల కైవసం
- చదువుతో పాటు ఆటలపై విద్యార్థుల దృష్టి

ప్రకాశం నగర్: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. రోజూ ఆటలు ఆడడం వల్ల శరీరానికి వ్యాయామం లభించి ఆరోగ్యవంతులుగా తయారవుతారు. చాలామంది చదువుపై చూపే శ్రద్ధను క్రీడలపై పెట్టరు. దీనివల్ల వివిధ అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి పిల్లలకు చదువు, క్రీడలు రెండూ రెండు కళ్ల వంటివని వైద్యులు చెబుతున్నారు. చదవడంతో పాటు ఆటలపై శ్రద్ధ చూపాలని సూచిస్తున్నారు. దీనికి అనుగుణంగా రాజమహేంద్రవరంలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ఆటల్లో రాణించి పతకాలు సాధించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాజమహేంద్రవరం ఖ్యాతిని వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 9వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో రాజమహేంద్రవరానికి చెందిన పలువురు విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఆత్మ రక్షణ కోసం కొందరు, హాబీగా మరికొందరు కరాటే నేర్చుకుని, ప్రత్యర్థిని మట్టి కరిపించేలా శిక్షణ తీసుకుంటున్నారు. బాలురతో సమానంగా బాలికలు రాణించి పతకాలు సాధిస్తున్నారు.



అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజేతలు వీరే..

- అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ అండర్ -14, 40 కేజీల విభాగంలో టి.గణేష్, 35 కేజీల విభాగంలో ఎస్.నిఖిలేష్, అండర్-17, 48 కేజీల విభాగంలో ఎ.వెంకట కావ్యశ్రీ, 45 కేజీల విభాగంలో పి.పూజ, అండర్-19, 55 కేజీల విభాగంలో కె.లక్ష్మి భవానీ బంగారు పతకాలు సాధించారు.
- అండర్-13, 32 కేజీల కాటస్ విభాగంలో కె.లాస్య, అండర్-19, 50 కేజీల విభాగంలో ఎస్.శ్రీలక్ష్మీలత, అండర్-14, 48 కేజీల విభాగంలో ఆర్.సహస్ర రేఖ వెండి పతకాలు గెలుచుకున్నారు.
- అండర్ - 14, 35 కేజీల విభాగంలో వికాస్ నారాయణ, 37 కేజీల విభాగంలో శరత్ శ్రీవంశీ, అండర్ - 19, 68 కేజీల విభాగంలో ఎల్.వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు.

అభినందనీయం



అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో నా దగ్గర శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించడం గర్వంగా ఉంది. కఠినమైన శిక్షణతో కూడిన కరాటేలో బాలురతో పాటు బాలికలు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించడం అభినందనీయం. క్రీడలతో శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం చేకూరుతుంది. వీటిలో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది.

– పిల్లి అరుణ్, కరాటే మాస్టార్

'నన్నయ'లో ఆ గ్రూపును కొనసాగించాలి

రాజమహేంద్రవరం సిటీ: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును యథాతథంగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు శుక్రవారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఆ గ్రూపును యూనివర్సిటీ యాజమాన్యం నీరు కార్చే ప్రయత్నం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, కో కన్వీనర్ డి.అశోక్ కుమార్ ధ్వజమెత్తారు. దానిలో వచ్చిన కొన్ని వివాదాలను, సమస్యలను సాకుగా చూపిస్తూ ఈ విద్యా సంవత్సరం నుంచి పొలిటికల్ సైన్స్ గ్రూప్‌లో అడ్మిషన్లు నిలిపివేయాలని ఆలోచన చేయడం తగదన్నారు. తక్షణమే యూనివర్సిటీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు స్పందించి రాజమహేంద్రవరం మెయిన్ క్యాంపస్‌లోని ఎంఏ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఆచార్యుల మధ్య వచ్చిన వివాదాలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో నూతన ఆచార్యుల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాలు కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ మార్ని వాసుదేవ్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అభివృద్ధి పనులు (50 కొత్త షాపులు, మరుగుదొడ్లు, పార్కింగ్ షెడ్లు, కార్యాలయం మరమ్మతులు) చేపట్టాలని తొలి తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, రాష్ట్ర రైతు నాయకులు మార్గాని సత్యనారాయణ, జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్, సెక్రటరీ వినుకొండ ఆంజనేయులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు శుక్రవారం దివాన్ చెరువులోని విజయ భారతి చెస్ట్ హాస్పిటల్ ప్రాంగణంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ విషయాలను చర్చించారు. కార్యక్రమంలో కొవ్వూరు టౌన్ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ఇంటి వీర్రాజు పాల్గొన్నారు.



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జ్ఞాన సరస్వతీ పీఠంలో పూజలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గౌతమి ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి పీఠాన్ని సినీ, టీవీ నటుడు శుభలేఖ సుధాకర్, గాయని ఎస్పీ శైలజ దంపతులు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వారికి మేళతాళాలు, పూర్ణకుంభంతో పీఠం మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోదావరికి సుధాకర్ దంపతులు నమస్కరించి, జ్ఞాన సరస్వతీ దేవికి పూజలు చేశారు. పీఠం విశిష్టత, ఆలయ నిర్మాణం తదితర విషయాలను తోట సుబ్బారావు వివరించారు. గైడర్ పెన్ వర్క్స్ తరఫున సుధాకర్, శైలజ దంపతులకు గంగుమళ్ల లక్ష్మణరావు దంపతులు పెన్నులు బహుకరించారు. అలాగే వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి మాదిరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాకా కార్యదర్శి జీవీ రమణ, నిమ్మలపూడి గోవింద్, మున్సిపల్ డీఈ మదర్సా అలీ, భమిడిపాటి రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.



జ్ఞాన సరస్వతీ పీఠంలో శుభలేఖ సుధాకర్, శైలజ దంపతులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడియం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడియం సీహెచ్‌సీ వైద్యులు మణిజ్యోత్స్న అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, విష జ్వరాలు, వాంతులు/విరేచనాలు తదితర సమస్యలు ప్రబలుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ఇళ్లలోని రుబ్బురోళ్లు, టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీళ్ల ట్యాంకులపై మూతలు పెట్టాలన్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో జ్వరం సర్వే చేస్తున్నారన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. అవసరమైనచోట్ల వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బాలికల వసతి గృహంలో ఏసీఎం, ఎబెట్ పిచికారీ జరిగిందన్నారు. మత్స్యశాఖ సహకారంతో గంబూషియా చేపలను నిల్వ నీటిలో విడుదల చేస్తున్నామన్నారు. ప్రజలు తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం పాటు, వేడి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.



డాక్టర్ మణిజ్యోత్స్న

ఓరియంటల్ కళాశాలను ప్రభుత్వం ఆదుకోవాలి

సీటీఆర్ఐ: ఓరియంటల్ కళాశాలకు ప్రభుత్వం చేయూత నివ్వాలని ఆంధ్ర యువతీ కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ పిలుపునిచ్చారు. కళాశాలలో జరుగుతున్న 54వ సపర్యా మహోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఆమె ప్రసంగించారు. తెలుగు భాషా ప్రమాణాలను పెంపొందించడానికి సదనం కళాశాల నిరంతర కృషి చేస్తోందని, ఇక్కడ చదువుకున్న విద్యార్థినులు శతావధానాలు చేస్తున్నారన్నారు. అర్ధ శతాబ్దానికి పైగా ప్రతి ఏటా వినాయక చవితి పండగను పురస్కరించుకుని సరస్వతీ సపర్యా మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయ శంకర ప్రభుత్వ సంగీత కళాశాలకు చెందిన అధ్యాపకులు, ఆకాశవాణి కళాకారులు బి.రవికిరణ్, కె.సాయికృష్ణ, ఇతర కళాకారుల వీణానాదం శ్రోతలను అలరించింది. అనంతరం కళాకారులను ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ, అధ్యాపకులు సత్య శిరీష, శ్రీదేవి, శేషుకుమారి సత్కరించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం పురాణం విజయలక్ష్మి పార్వతీ కల్యాణం హరికథాగానం వినిపిస్తారు.



కళాకారులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

స్వామిత్వ సర్వేలో కచ్చితత్వం పాటించాలి



కోరుకొండలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ: రీసర్వే, స్వామిత్వ పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే పనులను కచ్చితత్వంతో చేపడుతున్నా ఇంకా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వ్యవస్థను స్థిరీకరించడానికి అందరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. డేటా ప్రక్రియలో తప్పిదాలకు అస్కారం ఉండకూడదన్నారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి.మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ బాలు విగ్రహం ఆవిష్కరణ

ధవళేశ్వరం: స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖ గాయకుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని శనివారం సాయంత్రం ఆవిష్కరించనున్నట్లు గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రమణ తెలిపారు. గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సినీ నటుడు శుభలేఖ సుధాకర్, గాయని ఎస్పీ శైలజ, ప్రజాప్రతినిధులు, అధికారులు విచ్చేస్తారన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం సాయంత్రం 6.30 గంటలకు రాజమహేంద్రవరంలోని వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు.

31న అధునాతన వైద్యంపై సదస్సు

ప్రకాశం నగర్: ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న దివాన్ చెరువులోని ఎస్వీపీసీ కన్వెన్షన్‌లో అధునాతన వైద్యం, మందుల వాడకంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు వైద్యులు మిథున్ చక్రవర్తి, శేఖర్ రెడ్డి, రాజేష్, రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షుగర్, థైరాయిడ్, హార్మోన్లకు సంబంధించిన వైద్యులతో పాటు ఎండీ జనరల్ మెడిసన్ పీజీ స్టూడెంట్లు ఈ సదస్సుకు హాజరుకానున్నారని తెలిపారు.

21న బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: సిటీ బ్యాడ్మింటన్ కోర్టులోని బొప్పన స్పోర్ట్స్ క్లబ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 28 వరకూ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమారు 1500 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌కు హాజరవుతారన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ధవళేశ్వరం: విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి సూచించారు. ఆ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ధవళేశ్వరం బాలికల హైస్కూల్లో కెరీర్ గైడెన్స్, మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు ఎంవీ ధర్మారెడ్డి, మోటివేషనల్ స్పెషలిస్ట్ ఎం.శ్రీనివాస్, ప్రొఫెసర్ పి.సురేఖ, ప్రొఫెసర్ నూజిళ్ల శ్రీనివాస్ తదితరులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఉపాధ్యాయ శ్రీరామమూర్తి, సహ కార్యదర్శి ఉప్పల గొల్లబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో అధిక దిగుబడులు సాధించాలి

రాజానగరం: సాగులో అవకాశం ఉన్నంత మేరకు ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సేద్యపు విభాగం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం రైతులకు సూచించారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

క్లుప్తంగా

తుప్పల తొలగింపు



తుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ స్టాలిన్, కార్యదర్శి శ్రీనివాసు

కడియం: జేగురుపాడులోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను శుక్రవారం తొలగించారు. సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో జేగురుపాడు ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. ప్రజలు సహకరిస్తే మరింత ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ వినూత్న

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలని మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి (ఎంహెచ్‌ఓ) వినూత్న అన్నారు. ఆమె శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ ఫిర్యాదులను పరిష్కరించడంలో ఆర్ఎంసీ రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. మరింత ప్రగతి సాధించే దిశగా పని చేయాలని సూచనలు చేశారు. ప్రతి రోజు ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి అని, తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరగాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు ఎంతమంది విధులకు వస్తున్నదీ రికార్డులు ఉండాలన్నారు. రాత్రిపూట పనిచేసే సిబ్బందికి రేడియం అప్రాన్లు తప్పనిసరి అన్నారు. వినాయక నిమజ్జనాలు జరగనున్న నేపథ్యంలో వారం రోజుల పాటు విధులలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆకట్టుకుంటున్న కాణిపాకం గణనాథుడు



రథం వీధిలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం

ధవళేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ధవళేశ్వరం రథంవీధిలో రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాణిపాకం నమూనా గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. మట్టితో తయారు చేసిన ఈ విగ్రహం చుట్టూ నమూనా బావిని సైతం రూపొందించారు. ఉత్సవ నిర్వాహకుడు యడ్ల మహేష్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు గణపతి మాలలు ధరించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



మాజీ క్రీడాకారులను సత్కరిస్తున్న తిరుపాణ్యం తదితరులు

సీటీఆర్ఐ: మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. మాజీ క్రీడాకారుడు సుంకర నాగేంద్ర కిశోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం గెలుపు, ఓటమితో ముడిపడి ఉందన్నారు. అనంతరం క్రీడలలో విశేష సేవలందించిన ప్రముఖులను ప్రిన్సిపాల్ తిరుపాణ్యం సత్కరించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసులు

అనపర్తి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న అన్నారు. అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చేసిన తల్లిదండ్రులు, క్రతువు నిర్వహించిన అర్చకులు, కార్యక్రమానికి హాజరైన బంధువులపై కూడా కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీను నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, న్యాయవాదులు రమణమూర్తి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.